క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీడీ

కనగానపల్లి: కనగానపల్లి మోడల్ స్కూల్ విద్యార్థినులు ఆరుగురు జిల్లా స్థాయిలో జరగనున్న అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు పీడీ మాధవరాజులు తెలిపారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో రామగిరి మండలం నసనకోటలో క్లస్టర్ స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ మీట్‌లో పాఠశాల విద్యార్థినులు దీపిక, సరస్వతి, రిషిత, మున్ని (పరుగు పందెం), అనూష (షాట్‌పుట్) ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. వీరందరినీ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. స్థానిక పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ రవికిరణ్, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

ఏఈగా సుదర్శన్ యాదవ్

అమడగూరు: మండల హౌసింగ్ ఏఈగా సుదర్శన్ యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. గతంలో ఇక్కడ ఏఈగా పని చేస్తున్న భానుప్రకాష్‌ను గుడిబండకు బదిలీ చేయగా అక్కడ పని చేస్తున్న సుదర్శన్ యాదవ్‌ను మండలానికి నియమించినట్లు తెలిపారు.

విరాళం అందజేత



విరాళాన్ని అందజేస్తున్న ఎంజీ రెడ్డి

తనకల్లు: గోవిందువారిపల్లి ఎస్టీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి సోమవారం రూ. 50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లోనూ రామాలయాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వినోద్‌కుమార్, నాయకులు సమరసింహారెడ్డి, పూల శంకర్, అమర్ కార్తికేయ తదితరులున్నారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ

తనకల్లు: మండల పరిధిలోని తనకల్లు-3 (గోళ్లవారిపల్లి) గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష పథకంలో భాగంగా మంగళవారం అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పూల నరసింహులు మాట్లాడుతూ అన్ని అర్హతలున్న వారికి ప్రభుత్వం 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా ఇంటి వద్దకే అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డీ. సరస్వతీ, తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, ఈఓఆర్డీ ఆనందయ్య, నాయకులు చిదానందరెడ్డి, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

కదిరి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో సోమవారం వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు అల్తాఫ్ ఖాన్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ అన్నిదానాల్లో కెల్ల రక్తదానం గొప్పదన్నారు. 80 మంది దాకా యువకులు రక్తదానం చేశారు.

కాపునాడు అధ్యక్షుడిగా మల్లికార్జున

తనకల్లు: మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ కొండా మల్లికార్జున కదిరి అసెంబ్లీ కాపునాడు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొక్కంటిక్రాస్‌లోని కొండా మల్లికార్జున స్వగృహంలో పలువురు కాపు నాయకులు పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. కుమార్, మోహన్, బాలాజీ, మనోజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యలకూ పరిష్కారం

- శరవేగంగా అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



గువ్వలగుట్టపల్లి సమీపంలో పూర్తయిన కాజ్‌వే కం సిమెంటు రోడ్డు



బత్తలపల్లి గ్రామంలో తాగునీటి పైప్‌లైను పనులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం పెడపల్లి పంచాయతీలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బత్తలపల్లిలో దశాబ్ద కాలం నుంచి తాగునీటి పైప్ లైను లేక కేవలం సత్యసాయి వాటర్‌పై ఆధారపడి జీవించేవారు. అయితే, 15వ ఆర్థిక సంఘం నిధులతో సుమారు రూ.8.5 లక్షలతో తాగునీటి పైప్ లైనును గ్రామ సమీపంలోని చెరువులో ఏర్పాటు చేసిన బోరు నుంచి గ్రామంలోని వాటర్ ట్యాంకుకు, అక్కడి నుంచి వీధులకూ పైపులు ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- ఇక.. ఇదే పంచాయతీలోని గువ్వలగుట్టపల్లిలో గ్రామం నుంచి వందలాది ఎకరాల సాగు భూమి ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాలంటే చెరువు మరువను దాటాలి. మరువ పారిన ప్రతిసారీ ఎడ్ల బండ్లు, రైతులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. కోతకు గురైన కాలువలో వెళ్లే రైతుల ఇబ్బందులను గుర్తించి కాలువపై రూ.5.3 లక్షలతో కాజ్‌వే కం సిమెంటు రోడ్డు నిర్మించారు. దీంతో రైతులు ఏ కాలంలోనైనా ఇబ్బంది లేకుండా పొలాలకు వెళ్లవచ్చు. దీంతో రైతులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

'గడప గడప'లో అపూర్వ ఆదరణ

- హారతులు పట్టి స్వాగతం పలికిన మహిళలు



ఎమ్మెల్యే సిద్దారెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కదిరి: 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్, న్యూ హరిజన వాడ, కుమ్మరవీధి, సయ్యద్‌వీధి, గాంధీ నగర్‌లలో పర్యటించారు. గడప గడపలో ఆయనకు అపూర్వ ఆదరణ లభించింది. ప్రతి గడపలో మహిళలు హారతులు పట్టి, పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. జగన్ ప్రభుత్వంలో తామంతా సంతోషంగా ఉన్నామని పలువురు ఎమ్మెల్యేతో అన్నారు. అర్హత ఉన్నా టీడీపీ హయాంలో డబ్బులు ఇస్తే గానీ సంక్షేమ పథకాలు అందేవి కాదని, అప్పట్లో జన్మభూమి కమిటీ సభ్యులు పేదలను జలగల్లా పీడించారని కొందరు ఆవేదన వ్యక్త పరిచారు. ఈ ప్రభుత్వంలో ఏ నాయకుడితో పని లేకుండా ఇంటి దగ్గరకే వచ్చి పథకాలు అందజేస్తున్నారని సంతోషం వ్యక్త పరిచారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ..'జగన్ ప్రభుత్వం పేదల పక్షం.. చంద్రబాబు పెత్తందార్ల పక్షమన్నారు. అందుకే ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పట్ల సానుకూలంగా ఉన్నారన్నారు. మరోసారి జగన్‌ను సీఎంగా చూడాలని ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ జగనే సీఎం అని ప్రజలంతా ముక్తకంఠంతో చెబుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎల్లోమీడియాతో పాటు చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్, దత్త పుత్రుడు పవన్ ఈ ప్రభుత్వాన్ని ఏమీ చేయలేరని చెప్పారు. 9వ వార్డు కౌన్సిలర్ నాసీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, వైస్ చైర్మన్‌లు గంగాదేవి, రాజశేఖర్‌రెడ్డి, కమిషనర్ శ్రీహరిబాబు, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'షబ్బీర్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి'

పుట్టపర్తి టౌన్: ఎస్‌ఎంయూ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న షబ్బీర్‌పై అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షులు లింగ రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు ఫిర్యాదు చేశారనే నెపంతో లేనిపోని సాకులు చూపి డీపీటీఓ మధుసూదన్ సస్పెండ్ చేశారన్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. నిరంకుశంగా ప్రవర్తిస్తున్న డీపీటీపీపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కండక్టర్ నిజాయితీ

పుట్టపర్తి టౌన్: విజయవాడ సర్వీసులో పోగొట్టుకున్న పర్స్‌ను తిరిగి అందజేసి డ్రైవర్ బాబు నిజాయితీ చాటుకున్నారు. సోమవారం రిజర్వేషన్ బుకింగ్ ఆధారంగా గుర్తించి డిపోకు పిలిపించి డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న ఆధ్వర్యంలో బాధితులకు అందజేశారు. డ్రైవర్ నిజాయితీకి మెచ్చి రూ. 1,000 నగదు బహుమతి అందజేశారు. డిపో సిబ్బంది, తోటి కార్మికులు అభినందించారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామానికి చెందిన యంగమునిరెడ్డి ప్రమాదవు శాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటరకృష్ణారెడ్డి స్వగ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణ రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, కిరణ్ మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, జ్యోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పర్యటన

కనగానపల్లి: మండలంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మంగళవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మద్దెలచెరువులో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై, తర్వాత భానుకోటలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పెట్టె ఊరేగింపు

తాడిమర్రి: మండల కేంద్రంలో సోమవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పీర్ల పెట్టెను ఊరేగించారు. స్థానిక పీర్ల చావిడిలో భద్రపరిచిన పీర్ల పెట్టెకు నూతన వస్త్రాలు కప్పి, పూలమాలలతో అందంగా అలంకరించారు. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు ముజావర్లు, గ్రామస్తులు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో పీర్లపెట్టెను గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు పీర్లపెట్టెకు బెల్లం, చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ఐదో సరిగెత్తు

బత్తలపల్లి: మొహరం వేడుకలలో భాగంగా సోమవారం ఐదో సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బత్తలపల్లి ఖాసీంస్వామికి నిత్యపూజ నివేదన నిర్వహించారు. ఉదయం ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, నజరుల్లా, కాశీంవలిలు ఖాసీంస్వామి చావిడిలో ఫాతెహా చేశారు. ముస్లింలు ఫక్కీరుబాబాలుగా దీక్షలు స్వీకరించారు.

కొలువైన పీర్లు

తలుపుల: మొహరం పండుగ పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో పీర్ల చావిడిలలో సోమవారం పీర్లు కొలువయ్యాయి. నాలుగు రోజుల పాటు పెద్ద పీర్లు, చిన్న పీర్లు మెరవనిలు చేసి, ఆదివారం జలధి కార్యక్రమం నిర్వహిస్తారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



కొలువుదీరిన పీర్లస్వాములు

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న దస్తగిరి, కుళ్లాయిస్వామి ఉత్సవాల్లో పీర్లస్వాములను చావిడిలో కొలువు దీర్చి పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు కర్నూలు, గుంటూరు, కృష్ణ జిల్లాల నుంచి భక్తులు తరలి వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తగరకుంట, నరసంపల్లి, మామిళ్లపల్లి గ్రామాల్లో కూడా వేడుకలు ప్రారంభమయ్యాయి.

ఆలయ హుండీ లెక్కింపు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయ హుండీ కానుకలను సోమవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలయంలో మొత్తం మూడు హుండీలుండగా, శనివారం రాత్రి ఇద్దరు దుండగులు ఒక హుండీని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. అయితే రెండురోజుల క్రితం అమ్మవారికి వచ్చిన కానుకలను లెక్కించగా, చిల్లర (నాణేలు) మాత్రమే అందులో ఉండగా దుండగులు అలాగే వదలివెళ్లినట్లు ఆయన తెలిపారు. దీంతో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు హుండీలోని కానుకలు లెక్కించగా, రూ.2,04,230 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎస్‌ఐ జనార్దన్ నాయుడు, ఆలయ కమిటీచైర్మన్ కురుబ ముత్యాలప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలకు అదనపు జీవనోపాధులు

కదిరి అర్బన్: కరువు ప్రాంతమైన కదిరి రైతులకు ప్రభుత్వం అదనపు జీవనోపాధులు కల్పించడం హర్షించదగ్గ విషయమని ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పట్నం, యర్రదొడ్డి గ్రామాల్లో మహిళా రైతులతో సమావేశం నిర్వహించారు. ఎంఎస్‌ఎంఈ సెంట్రల్ టీం సభ్యులు వీరయ్య, వెలుగు పీడీ నరసయ్య, ఎంపీడీఓ అంజనప్ప, కదిరి క్లస్టర్ ఏసీ రమణప్ప, డీపీఎం రామ్మోహన్ హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ దవనం, మల్లెలు సాగు చేసేలా మహిళా రైతులకు అదనపు జీవనోపాధులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పెర్ఫ్యూమ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేసేలా కృషి చేసిన ఎమ్మెల్యే సిద్దారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ దవనం, మల్లెలు సాగు చేసి వాటితో పెర్ఫ్యూమ్ తయారు చేసి ఇతర దేశాలు, రాష్ట్రాలకు విక్రయించి ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. అనంతరం మహిళా రైతుల నుంచి ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, ఫోన్ నంబర్‌ను పరిశీలించారు.

పేదల కోసమే 'జగనన్న సురక్ష'



ప్రజలకు సర్టిఫికెట్లు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం: పేద ప్రజల కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, సచివాలయాల కన్వీనర్ మాసపల్లి సాయికుమార్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలోని 9వవార్డు లింగాల్టిపాలెం సచివాలయం వద్ద సోమవారం ప్రజలకు 'జగనన్న సురక్ష' కింద 11 రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మొత్తం 1,000 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన జగనన్న సురక్ష

తలుపుల: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆఖరి రోజు ఈదులకుంట్లపల్లి గ్రామంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. 320 సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, సర్పంచ్ కుమారిబాబు, జేసీఎస్ కన్వీనర్ టోపీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

జాషువా సాహిత్య కృషి ఆదర్శం

ధర్మవరం అర్బన్: గుర్రం జాషువా జీవితం, సాహిత్య కృషి అందరికి ఆదర్శం కావాలని ప్రధాన వక్త ఏలూరి ఎంగన్న, సాహితీ స్రవంతి కన్వీనర్ హరిలు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గుర్రం జాషువా 52వ వర్ధంతి వేడుకలను పాఠశాల హెచ్‌ఎం శైలజ సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో హిందీ పండిట్ వేణుగోపాలాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ బత్తలపల్లి కార్యవర్గం ఎన్నిక



గోపాల్, నాగశేషణ

బత్తలపల్లి: ఏపీటీఎఫ్ బత్తలపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో సోమవారం ఎన్నికల అధికారి రవీంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బీకే ముత్యాలప్ప హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా బి.గోపాల్, గౌరవాధ్యక్షులుగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా నాగశేషణ, ఉపాధ్యక్షులుగా తిమ్మప్ప, నారాయణస్వామి, వెంకటేశులు, సునిత, మస్తాన్‌వలి, కార్యదర్శులు తిప్పేస్వామి, హరికృష్ణ, రామసుబ్బారెడ్డి, ప్రమీల, ప్రసాద్, లక్ష్మీనారాయణ, జిల్లా కౌన్సిలర్లుగా నాగేశ్వరయ్య, వెంకటనారాయణ, శ్రీలక్ష్మీ, ఆడిట్ కన్వీనర్‌గా రామునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కోనంకి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీపీఎస్ విధానాన్ని ఒప్పుకునేది లేదన్నారు. 98 కంటే తక్కువ విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌లను తొలగించి ఎస్‌జీటీలతో బోధన కొనసాగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతులకు వ్యవసాయ పథకాలు అందాలి

తనకల్లు: వ్యవసాయ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు అందాలని వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ అన్నారు. స్థానిక ఆర్‌బీకేలో సోమవారం ప్రభుత్వం అమలుచేస్తున్న వ్యవసాయ పథకాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంట యాప్‌లో పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. పంట కొనుగోలు, పంట నష్ట పరిహారం, పంట బీమా తదితర పథకాలు పొందాలంటే ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. మట్టి నమూనా పరీక్ష సేకరణతో పాటు పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోని రైతుల్ని గుర్తించి, నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆర్‌బీకేలలో ఎరువులను అందుబాటులో ఉండేలా చూసి, ఇండెంట్ పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నయాజ్, ఎంపీఈఓ మెహతాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి విత్తనాల పంపిణీ

బత్తలపల్లి: పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు, గడ్డి కత్తిరించే యంత్రాలను పంపిణీ చేస్తామని బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డాక్టర్ యం.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక పశువైద్యశాలలో విలేకర్లతో మాట్లాడుతూ పాడి రైతులకు మేలైన సీఎస్‌హెచ్24ఎంఎఫ్ రకం గడ్డి విత్తనాలు 75 శాతం సబ్సిడీ పోను 25 శాతం మాత్రమే రైతులు తమ వాటాగా కేజీకి రూ.23 చొప్పున ఒక్కో రైతుకు 20 కేజీలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గడ్డి కత్తిరించు యంత్రాలు 2 హెచ్‌పీ పవర్ బ్లేడ్ పూర్తి ధర రూ.33,972 కాగా ఇందులో రాయితీ ధర రూ.13,588, రైతు వాటాగా రూ.20,382 చెల్లించాల్సి ఉంటుందన్నారు. యంత్రాలతో మేత వృథా కాదని తెలిపారు. రైతులు సమీప పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు. అంతకు ముందు పాడి రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సురేష్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

తనకల్లు: టీ. సదుంకు చెందిన వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు గౌస్‌పీర్ తండ్రి మహమ్మద్ అలీ ఖాన్ (80) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి సోమవారం గ్రామానికి వచ్చి మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, నాయకులు రెడ్డిపీరా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి వెంకటరమణయ్య జయంతి

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతిని గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయనను గ్రంథాలయ పితామహునిగా కీర్తిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, రమణనాయక్, పాఠకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అమడగూరు: ఓడీ చెరువు మండలం, మహమ్మదాబాద్ క్రాస్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వేమారెడ్డిపల్లికి చెందిన అశోక్, పగడాలవారిపల్లికి చెందిన రమేష్‌తో పాటు మరో ఇద్దరు కారులో గోరంట్ల నుంచి ఓడీ చెరువు వెళుతుండగా క్రాస్ వద్ద కారు కరెంట్ స్తంభానికి ఢీ కొట్టింది. అశోక్, రమేష్ కారులో నుంచి ఎగిరిపడగా ఇద్దరూ మతిస్థిమితం కోల్పోయారు. వెంటనే 108లో కదిరి ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్సల నిమిత్తం అశోక్‌ను అనంతపురం, అక్కడి నుంచి బెంగుళూరుకు తరలించినట్లు ఈఎంటీ నాగేంద్ర, పైలెట్ అంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

గిరిజన రాజకీయ చైతన్యయాత్ర వాయిదా

పుట్టపర్తి టౌన్: అనివార్య కారణాల వల్ల ఆగస్టు 9 న జరగాల్సిన గిరిజన రాజకీయ చైతన్య యాత్ర వాయిదా పడినట్లు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవినాయక్ తెలిపారు. సోమవారం ప్రశాంతి గ్రామంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా గిరిజనులతో పుట్టపర్తి పట్టణంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఎరకల యువ సైన్యం జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

ప్రైవేటు డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ధర్మవరం: విద్యార్థులకు హాల్ టికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతలయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు శివ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఏఓకు వినతిపత్రం అందించారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సాయికిరణ్, రవికుమార్, నందగోపాల్, విష్ణు, హసిక్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మార్షల్ ఆర్ట్స్, యోగా శిక్షణ

నల్లచెరువు: మండల కేంద్రంలోని కస్తూరి బాయి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మూడు నెలల పాటు ఆర్డీటీ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్,యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. 25 మంది విద్యార్థినులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సోమవారం ప్రధానోపాధ్యాయురాలు శిరీష తెలిపారు. ముఖ్య అతిథిగా ఎస్సై వరలక్ష్మి పాల్గొని విద్యార్థులకు కరాటే దుస్తులు, యోగా మ్యాట్లు పంపిణీ చేశారు. ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, ఏటీఎల్ సుకన్య తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి బార్‌కు గుర్తింపు దక్కడం హర్షణీయం

పుట్టపర్తి అర్బన్: బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ నుంచి పుట్టపర్తి బార్‌కు గుర్తింపు లభించడం హర్షణీయమని జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ తెలిపారు. సోమవారం పుట్టపర్తి కోర్టు హాల్‌లో న్యాయవాద బృందాన్ని అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి ఆధ్వర్యంలో గుర్తింపు రావడం చాలా సంతోషమన్నారు. న్యాయవాదుల ఐక్యత పెరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకటరమణప్ప, రహిమాన్, శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న కంపచెట్లను సోమవారం జేసీబీతో తొలగించారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, నాయకులు రామచంద్ర ఈ కార్యక్రమం చేపట్టారు.

మొక్కల సంరక్షణ బాధ్యతగా చేపట్టాలి

ఎన్పీకుంట: ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు మొక్కల సంరక్షణను బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ ఆదినారాయణ, ఏపీఓ చంద్రశేఖర్ రైతులకు సూచించారు. సోమవారం గోవిందరాజులపల్లి గ్రామంలో ఉద్యాన పంటలను వారు పరిశీలించారు. రైతులకు మూడు సంవత్సరాల పాటు నిర్వహణా ఖర్చులను ప్రభుత్వం అందిస్తుందని, మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని రైతులకు సూచించారు.